క్లుప్తంగా

బీమా చెక్కులు అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆయన నివాసంలోనే సోమవారం పార్టీ సభ్యత బీమా చెక్కులను అందజేశారు. మండలంలోని తిమ్మాపూర్, రైలాపూర్ పరిధిలోని కుషన్ తండాలో గల బీఆర్ఎస్ సభ్యత్వ బీమా చేసి, ప్రమాదవశాత్తు మృతి చెందిన బ్యాగరి మొగులమ్మ, ధరావత్ మదన్‌లాల్ కుటుంబ సభ్యులకు రూ. 2 లక్షల బీమా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని రామాయలం పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా బాలాలయంలో సీతారామచంద్రుడు, లక్ష్మణుడు, భరత, శత్రుఘ్నుడు, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం అంగరంగ వైభవంగా ముగిశాయి. మూడు రోజులుగా ఆలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలాలయంలో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు, ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మురళిపంతులు, గ్రామస్తులు ఆర్ఎన్.సంతోష్, కందుకూరి రవీందర్, సిద్ధు, అనిల్, దాదిగారి గంగాధర్, రామచంద్రాచారి, నర్సింలు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సంగాయిపేటలో 90 శాతం ధాన్యం కొనుగోళ్లు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట గ్రామంలో సోమవారం నాటికి 90 శాతం వరి ధాన్యం కొనుగోళ్లు చేశానట్లు మంజీరా వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం సిబ్బంది తెలిపారు. ఈ సీజన్‌లో రైతుల నుంచి 90 వేల బస్తాల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ అకాల వర్షాలతో భారీ స్థాయిలో దిగుబడి తగ్గిందన్నారు. ఇప్పటివరకు 330 మంది రైతుల నుంచి 55,095 బస్తాల ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు రవాణా సైతం చేశామన్నారు. ఇంకా 3000 బస్తాల ధాన్యం రవాణా చేయాల్సి ఉందని, అది కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు.

ఉమా ధర్మలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక పూజలు చేస్తున్న మదన్‌రెడ్డి, సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ధర్మారం గ్రామంలోఉమా ధర్మలింగేశ్వర స్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, దృగ్బలి, నేత్రోన్మీలనము, పూర్ణాహుతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ ఉత్సవాలకు ఆహ్వానం

నర్సాపూర్: పట్టణంలో ఈనెల 24న ప్రారంభమయ్యే ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలకు రావాలని గౌడ సంఘం నాయకులు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డిలకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సంఘం నాయకులు యాదాగౌడ్, సత్యంగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, ఆంజనేయులుగౌడ్ తదితరులు సోమవారం మదన్‌రెడ్డి, సునీతారెడ్డిలను హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో వేర్వేరుగా కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో జేఏసీ ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ కోసం రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షలు సోమవారం నాటికి 57వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వం డివిజన్ ప్రకటించే వరకు ఆందోళన విరమించమని హెచ్చరించారు.

గాలివాన బీభత్సం

- తిమ్మాపూర్‌లో పిడుగుపాటుతో మహిళా రైతుకు గాయాలు
- పిల్లుట్ల పాఠశాలపై కూలిన భారీ వృక్షం



శివ్వంపేట(నర్సాపూర్): పిల్లుట్లలో ధాన్యం కుప్పలో నిలిచిన వర్షం నీటిని తీస్తున్న రైతు



రేగోడ్(మెదక్): వర్షానికి తడిసిన ధాన్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మహిళ రైతు దానమైన మంజుల కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న ధాన్యం కుప్పలపై కవర్ కప్పుతుంది. ఈ క్రమంలో పిడుగు పడడంతో ఆమెకు గాయాలైయ్యాయి. ఆమె పరిస్థితిని గుర్తించిన తోటి రైతులు, కుటుంబ సభ్యులు చికిత్స కోసం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈదురు గాలులతో పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో అంధకారం నెలకొంది. పిల్లుట్ల గ్రామంలో భారీవృక్షం కూకటి వేళ్లతో సహ విరిగి ప్రాథమిక పాఠశాల పై పడింది. దీంతో పాఠశాల మూడు గదులపై కప్పు రేకులు విరిగిపోయాయి. నిత్యం ఈ చెట్టు నీడన గ్రామస్తులు కూర్చుంటారు. రాత్రి వేళలో కూలిపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. టిక్యాదేవమ్మగూడెం తండాలో పలు చెట్లు కూలి పంట



శివ్వంపేట(నర్సాపూర్): కూలిన భారీ వృక్షం

పొలంలో పడింది. అలాగే కల్లాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం తడిసిపోయింది. అకాల వర్షానికి పాడైపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు.

టేక్మాల్(మెదక్): మండలంలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు.



నర్సాపూర్ రూరల్: చిన్నచింతకుంటలో..

వర్షానికి రాలిన మామిడి

నర్సాపూర్ రూరల్: మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షానికి మామిడి కాయలు పూర్తిగా రాలిపోగా, అక్కడక్కడ ధాన్యం కుప్పలు తడిచాయి. చిన్నచింతకుంట, తిరుమలాపూర్, కాజీపేటతో పాటు ఆయా గ్రామాల్లో ఈదురుగాలితో కూడిన చిన్నపాటి వర్షానికి మామిడికాయలు పూర్తిగా రాలిపోయి రైతులకు నష్టం జరిగింది.



రేగోడ్‌లో ..

అకాల వర్షానికి తడసిన ధాన్యం



టేక్మాల్‌లో ..



పెద్దశంకరంపేట(మెదక్): పేట శివారులో తడిసిన ధాన్యం బస్తాలు

పెద్దశంకరంపేట(మెదక్): అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పంట పొలాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచిన ధాన్యం తడిసింది. దీంతో పాటు రాత్రి వేళ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో అన్ని వీధుల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టనందున ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మించనందున వర్షం కురిస్తే రోడ్డంతా బురద మయంగా తయారవుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు నిర్మించాలని అధికారులకు చెప్పినా.. ప్రయోజనం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కురిసిన చిన్నపాటి వర్షానికి కాలనీలోని రోడ్డు బురదగా మారడంతో కాలి నడకన వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షం కురవగానే తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు.

రేగోడ్(మెదక్): మండలంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయింది. రైతులు వర్షానికి ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఎక్కడా పంట నష్టం జరగలేదని ఏఓ జావిద్ సోమవారం తెలిపారు.

లారీల సమస్య పరిష్కరిస్తాం

చిలప్‌చెడ్(నర్సాపూర్): ధాన్యం కొనుగోలు విషయంలో తీవ్రంగా లారీల సమస్య ఉందని ఉన్నతాధికారులతో చర్చించి, ఆ సమస్యను పరిష్కరిస్తామని జిల్లా ముఖ్య ప్రణాళిక మండల ప్రత్యేకాధికారి మహ్మద్ ఖాసీం అన్నారు. సోమవారం ఆయన మండలంలోని అంతారం, సామ్లా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, రైతులతో చర్చించారు. సామ్లా తండాలో లారీలు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సర్పంచ్ భిక్షపతి, ప్రత్యేకాధికారి ఖాసీంకు వివరించారు. ఈ సందర్భంగా ఖాసీం మాట్లాడుతూ.. ఉన్నతాధికారులతో చర్చించి గన్నీ బ్యాగులు తెప్పిస్తామని, లారీల సమస్య కూడా పరిష్కస్తామన్నారు. కార్యక్రమంలో మండల గణాంక అధికారి వెంకటేశ్, సీసీలు నర్మద, వరలక్ష్మి, కార్యదర్శులు రవిశంకర్‌రెడ్డి, మనోచారి తదితరులు పాల్గొన్నారు.



సామ్లా తండాలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న మహ్మద్ ఖాసీం

రైతులు అధైర్య పడొద్దు



జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి

తూప్రాన్: ధాన్యం సేకరణలో రైతులు అధైర్య పడొద్దని జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ గౌరై వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కాగ రైస్‌మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా లారీలను తొందరగా ఖాళీ చేసుకోవాలని సూచించారు. ఇష్టానుసారంగా బస్తాకు కిలోల కొద్ది తరుగుతో రైతులకు నష్టం కలిగించే విధంగా దోపిడి చేస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. సంబంధిత అధికారులు సైతం లారీలు, హమాలీల కొరత లేకుండా ధాన్యం త్వరగా సేకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ అశోక్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలు

నేరుగా మిల్లులకే ధాన్యం

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన మొక్కుబడిగా పని చేస్తున్నాయని, ప్యాడి క్లీనర్ పెట్టకుండా తూకం వేయకుండా నేరుగా మిల్లులకే ధాన్యం పంపడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు అల్లాదుర్గం మండల రైస్ మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల సిబ్బంది ఇష్టరాజ్యంగా వ్యవహరించడంతో మిల్లుల వద్ద గొడవలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. ట్రాక్టర్ల ద్వారా ధాన్యం మిల్లుకే పంపుతుండటంతో తాము కొనుగోలు కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేశారని వారు ప్రశ్నించారు. ధాన్యం తమే తూకం వేసి ట్రాక్‌షిట్ రాసిస్తే కొనుగోలు కేంద్రాల్లోనే కొనుగోలు చేసినట్లు రికార్డులు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. రాంపూర్ మిల్లుకు టేక్మాల్, అల్లాదుర్గం కేంద్రాల నుంచి ధాన్యం పంపుతున్నట్లు మిల్లు యాజమానులు చెప్పారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'రైతులకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకోం'



తూప్రాన్ ఆర్డీఓతో మాట్లాడుతున్న శ్రవణ్‌కుమార్‌రెడ్డి



మక్కరాజీపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వసంతసుగుణ

చేగుంట(తూప్రాన్): ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బందులు కలిగిస్తే ఊరుకునేది లేదని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ రెడ్డి అన్నారు. చేగుంటకు వచ్చిన సందర్భంగా ఆయన వడియారం, మాసాయిపేట శివారులోని ధాన్యాన్ని కాంగ్రెస్ నాయకులతో పరిశీలించి, రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మాసాయిపేటలో ఉన్న ఆర్డీఓ శ్యాంప్రకాశ్ మాసాయిపేట తహసీల్దార్ మాలతితో రైతుల సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆర్డీఓ ధాన్యం త్వరగా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మండలంలోని మక్కరాజీపేటతో పాటు చందాయిపేట కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ శాఖ ఏడీఏ వసంతసుగుణ సోమవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లోని సాంకేతిక అంశాలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ పరిశీలనలో ఏఈఓలు మాధవి, భువనేశ్వరీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ అందజేత

రేగోడ్(మెదక్): మండలానికి జెడ్పీ నిధులు రూ.20 లక్షలు మంజూరు అయ్యాయని, జెడ్పీ చైర్ పర్సన్ హేమలత ప్రొసీడింగ్ పత్రాన్ని తనకు అందించారని జెడ్పీటీసీ యాదగిరి సోమవారం తెలిపారు. మోడల్ స్కూల్, రేగోడ్ ఉన్నత పాఠశాల, టి.లింగంపల్లి, జగిర్యాల పాఠశాలలకు రూ.10 లక్షలు, సిందోల్ – తాటిపల్లి పార్మేషన్ రోడ్డు నిర్మాణానికి మరో రూ.10 లక్షలు నిధులు కేటాయించానని చెప్పారు.



ప్రొసీడింగ్ పత్రాన్ని అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థికసాయం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటకు చెందిన గోమారం పెంటయ్య, పెద్దకోళ్ల భుమయ్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా రూ.5 వేల చొప్పున నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. తుక్యా తండాలో క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు యువకులకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. గౌడ సంఘం మండల ఉపాధ్యక్షుడిగా నియమితులైన చెన్నాపూర్ గ్రామానికి చెందిన రాంచెంద్రంగౌడ్‌ని ఈ సందర్భంగా జెడ్పీటీసీని సన్మానించారు. దంతన్‌పల్లిలో కన్నారం దుర్గయ్య, కొంతన్‌పల్లిలో రాయలి అంజమ్మ కుటుంబాలకు పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి రూ. 5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, దుర్గేశ్, ఉప సర్పంచ్‌లు నాగేశ్వర్‌రావ్, పద్మ, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

◆ మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

చేగుంట(తూప్రాన్): తెలంగాణ మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పిట్టల రవీందర్‌ను సోమవారం హైదరాబాద్‌లో కలిసినట్లు మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కాశబోయిన భాస్కర్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రవీందర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు పేర్కొన్నారు. రవీందర్‌ను కలిసిన వారిలో ముదిరాజ్ నాయకులు ఆంజనేయులు, సోమ వెంకటేశ్, నర్సింహ తదితరులు ఉన్నారు.

◆ వార్షికోత్సవాలకు ముస్తాబైన ఎల్లమ్మ ఆలయం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని నాగ్సాన్‌పల్లిలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 23న గ్రామస్తులు అమ్మవారికి బోనాలు ఊరేగించి, ప్రత్యేక పూజలు చేయనున్నట్లు సర్పంచ్ ఎల్లం, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

◆ అందుబాటులో నాణ్యమైన విత్తనాలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని నత్నయ్యపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో నాణ్యమైన అందుబాటులో ఉన్నాయని పరిశోధన స్థానం శాస్త్రవేత్త శోభ సోమవారం తెలిపారు. వరి, జీలుగా, జనుము, విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈనెల 24న నత్నయ్యపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో విత్తన మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు.

◆ కంటివెలుగు శిబిరం ప్రారంభం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కోర్విపల్లి గ్రామంలో సర్పంచ్ పద్మమల్లేశ్ సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జయమ్మ, ఉప సర్పంచ్ సంతోష్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

◆ పరామర్శ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి సోమవారం సాయంత్రం పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబురావు, బీఆర్ఎస్ నాయకులు యాదగౌడ్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సయ్య, సుధాకర్‌రెడ్డి, వీరేశ్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

◆ 24న పాదయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఈనెల 24న నిజాంపేట నుంచి రామాయంపేట వరకు పెద్ద ఎత్తున పాదయాత్ర నిర్వహించనున్నట్లు నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయకుమార్ (బీఆర్ఎస్) తెలిపారు. ఆయన సోమవారం పట్టణంలోని పలు కులసంఘాలు, అఖిలపక్షం ప్రతినిధులు, వ్యాపార సంఘాలతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ ఉద్యమంలో వ్యాపారులు, కుల సంఘాలు, అఖిలపక్షం నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజయకుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిలపక్షం ప్రతినిధులు రమేశ్‌రెడ్డి, పోచమ్మల అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

◆ దుర్గమ్మను దర్శించుకున్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ డైరెక్టర్

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గా భవాని మాతను తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డైరెక్టర్ సుమిత్ర ఆనంద్ తాలోబ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సోమవారం ఏడుపాయలకు చేరుకోగా పాలక మండలి చైర్మన్, ఈఓ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సమస్యల పరిష్కారానికి సహకరించాలి

పెద్దశంకరంపేట సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శ్రీనివాస్

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రజాప్రతినిధులకు సహకరించాలని పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. సోమవారం పేట మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేలా చూడాలని, ఈ సమావేశాలకు విద్యుత్ అధికారులు హాజరుకాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో మన ఊరు – మనబడి పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. బడులు ప్రారంభించే నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లతో పాటు మన ఊరు – మనబడి, కంటి వెలుగు తదితర కార్యక్రమాలను చేపడుతుందన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని, అకాల వర్షాలకు ఇబ్బందులు పడుతున్న రైతుల ధాన్యం తరలింపులో మిల్లర్లు సహకరించాలన్నారు. ప్రతీ సమావేశాలకు విద్యుత్ శాఖ ఏఈ రాకపోవడంతో వారంలోపు పనితీరు మార్చుకోకుంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఫిక్ ఉన్నిసా, నీటిపారుదల శాఖ డీఈ రోహిణి, వైస్ ఎంపీపీ లక్ష్మి, రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధ సంజీవరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలిన వీఓఏలు

పెద్దశంకరంపేట(మెదక్): సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వీఓటులు సోమవారం కలెక్టరేట్ ముట్టడికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ వారికి మద్దతు తెలిపారు. నెల రోజులుగా సమ్మె చేపడుతున్న వీఓఏల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ముట్టడికి తరలిన వారిలో వీఓఎల సంఘం అధ్యక్షురాలు రాజేశ్వరి, రమా, స్వరూప, పుష్ప, విజయలక్ష్మి, శంకర్, నగేశ్ తదితరులున్నారు.



కలెక్టరేట్ ముట్టడికి తరలుతున్న వీఓఏలు

నకిలీ విత్తనాలు తయారు చేస్తే కఠిన చర్యలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): విత్తనాల నమూనాలు సేకరిస్తున్న ఏఓ బాల్‌రెడ్డి



మనోహరాబాద్(తూప్రాన్): స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

మనోహరాబాద్(తూప్రాన్): విత్తన పరిశ్రమల్లో నకిలీ విత్తనాలను తయారు చేస్తే వారిపై చట్టరీత్య చర్యలు తప్పవని రాష్ట్ర స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారి ఏడీఏ పద్మజ అన్నారు. రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక టీంలు జిల్లాల్లో తనిఖీల్లో భాగంగా సోమవారం మండలంలో పలు పరిశ్రమల్లో తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. వీరి తనిఖీల్లో కాటన్ సీడ్‌లో బీజీ–3 విత్తనాలను పరిక్షించినట్లు తెలిపారు. రికార్డులు, సీడ్స్ స్టాక్‌లను తనిఖీ చేశారు. వీరి వెంట ఏడీ సీడ్ సర్టిఫికేషన్ అధికారి పృథ్వీరాజ్, టీం ఎస్ఐ మల్లారెడ్డి, ఏఓ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఫర్టిలైజర్ దుకాణాల్లో ప్రభుత్వ అనుమతులు ఉన్న ఎరువులు, విత్తనాలనే అమ్మాలని మండలంలోని వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం చిలప్‌చెడ్ గ్రామంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని ఏఓ బాల్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగ్రో రైతు సేవా కేంద్రంలో విత్తనాలు, తదితర స్టాక్ పరిశీలించడంతో పాటు, రికార్డులు తనిఖీ చేశామన్నారు. అదేవిధంగా రైతు సేవా కేంద్రంలో గల జీలుగు, జనుము విత్తనాల నమూనాలు సేకరించామన్నారు. నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం నిర్వాహకులు శ్రీనివాస్, రమేశ్ ఉన్నారు.

సీడ్ కంపెనీలో..

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని హకింపేట గ్రామ శివారులోని పినాక అగ్రి సొల్యూషన్ సీడ్స్ కంపెనీలో రాష్ట్ర కమిషనరేట్ నుంచి వచ్చిన టాస్క్ ఫోర్స్ టీం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడ్ రికార్డ్స్, స్టాక్‌ను పరిశీలించారు. తనిఖీలో ఏడీఏ పద్మజ, ఏడీ సీడ్ సర్టిఫికేషన్స్ పృథ్వీరాజ్, ఎస్ఐ మల్లారెడ్డి, మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల జీతం పెంచాలి

కౌడిపల్లి(నర్సాపూర్): ఆశ వర్కర్ల జీతం రూ. 18 వేలకు పెంచాలని, ఆశలకు నిర్వహించే ప్రభుత్వ పరీక్షను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ అన్నారు. సోమవారం ఆమె ఆశ వర్కర్లతో కలిసి వారి సమస్యలు పరిష్కరించాలని కౌడిపల్లి పీహెచ్‌సీ మెడికల్ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. వారికి సరైన న్యాయం జరగకపోతే ఈ నెల 29న జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామన్నారు. కార్యక్రమంలో చెన్నమ్మ, బాలమణి, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో ఆశవర్కర్లతో పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



కొల్చారం(నర్సాపూర్): వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ కోశాధికారి నర్సమ్మ